సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 17 । జూన్ । 2024



త్యాగాలకు ప్రతీక.. బక్రీద్

ధనిక, పేద తారతమ్యం లేకుండా ప్రతి ముస్లిం బక్రీద్ జరుపుకుంటారు. అల్లాహ్ ప్రసన్నం కోసం చేసిన త్యాగాన్ని ముస్లింలు స్మరించుకుంటారు. 8లో



పచ్చిరొట్టగా నవధాన్యాలు

సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన పెరగడంతో పచ్చిరొట్ట సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. పచ్చిరొట్టగా నవధాన్యాల సాగు చేస్తున్నారు. 8లో



పడాలలో వ్యక్తి హత్య

పాతగొడవల నేపథ్యంలో తాడేపల్లిగూడెం మండలం పడాల గ్రామంలో శనివారం రాత్రి ఓ వ్యక్తి హత్యకు గురి కాగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 8లో

ఉచిత పాసులు.. చదువుకు ఊతం

- 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
- జిల్లాలో మార్చి వరకూ 11,703 పాసుల జారీ
- రెన్యువల్‌కు ఆర్టీసీ కసరత్తు



భీమవరం(ప్రకాశం చౌక్): విద్యార్థులు పట్టణాల్లోని స్కూళ్లు, కళాశాలకు ఉచితంగా ప్రయాణించేందుకు ఆర్టీసీ ప్రతి ఏడాది ఏర్పాటు చేస్తుంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా ఉచిత పాస్‌లను మంజూరు చేస్తుంది. 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు స్కూల్, కళాశాలకు వెళ్లేందుకు పాస్‌లు ఇస్తున్నారు. ఈ ఏడాది కూడా కొత్త పాస్‌లు ఇవ్వడంతె సాటీ పాత పాస్‌లు రెన్యువల్‌కు చర్యలు చేపట్టారు. 2024–25 విద్యా సంవత్సరంలో పాఠశాలు, కళాశాలలు పునఃప్రారంభమైన వెంటనే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా బస్ పాస్‌లు అందించడానికి ఆర్టీసీ సిద్ధంగా ఉంది. జిల్లాలోని భీమవరం, తణుకు, నర్సాపురం, తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోల నుంచి విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత, రాయితీ బస్ పాస్‌లను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బస్ పాస్ పొందాలంటే..

12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచితంగా పాసులు జారీ చేస్తున్నారు. ఇవి ఏడాది చెల్లుబాటవుతాయి. ఈ పాస్ ద్వారా విద్యార్థులు తమ ఇంటి నుంచి 20 కిలోమీటర్ల వరకూ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇందుకు విద్యార్థి ఫొటో, స్కూల్ యాజమాన్యం నుంచి (బోనఫైడ్ సర్టిఫికెట్), ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. మిగతా వారికి రాయితీపై పాస్‌లు మంజూరు చేస్తారు. పాస్ ధరతో నెలవారీ గుర్తింపు కార్డు రూ.50, సర్వీస్ చార్జీ రూ.40 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. రాయితీతోపాటు సంవత్సరం గుర్తింపు కార్డు కోసం రూ.100 చెల్లించాలి. రాయితీ బస్ పాస్‌లు నెల, మూడు నెలలు, ఏడాది కాలపరిమితితో మంజూరు చేస్తారు. గడువు ముగిశాక రెన్యువల్ కోసం ప్రిన్సిపాల్ సంతకం చేయించుకుని తిరిగి పొందాలి. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకూ, ఐటీఐ, పారా మెడికల్ వంటి కోర్సులు చదివే వారికి మే నెల వరకు పాసులు మంజూరుచేస్తారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక స్టేజీగా పరిగణనలోకి తీసుకుని దూరాన్ని బట్టి రాయితీ ఇస్తారు.

దివ్యాంగులకు ఉచిత పాసులు

ఆర్టీసీ దివ్యాంగులకు ఉచిత పాసులు అందిస్తుంది. పాస్ పొందడానికి సర్టిఫికెట్, ఆధార్ కార్డు, అన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ సమర్పించాలి. మూడేళ్ల కాల వ్యవధితో ఈ పాస్‌లు జారీ చేస్తారు. ఐడీ కార్డుకు రూ.100 చెల్లించాలి.

విద్యార్థులకు రాయితీ పాసులు

18 ఏళ్లు దాటిన విద్యార్థులకు కూడా రాయితీ పాస్ ఇస్తారు. చార్జీలో ఒక వంతు మాత్రమే విద్యార్థి చెల్లించేలా ఈ పాస్‌లు జారీ చేస్తారు. విద్యార్థి నివాసం నుంచి 50 కిలోమీటర్ల వరకూ రాయితీ పాస్ జారీ చేస్తారు. కళాశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ సమర్పించాలి. నెలవారీ పాస్ ఐడీ కార్డులకు రూ.100 చొప్పున చెల్లించాలి. ఆర్టీసీ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలి. కొత్తగా దరఖాస్తు చేసుకునే కళాశాల విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ జత చేయాలి. దరఖాస్తులు సమీప ఆర్టీసీ డిపో మేనేజర్ పరిశీలించి పాస్ మంజూరుకు సిఫార్సు చేస్తారు.

డిపోల వారీగా మార్చి వరకూ ఉన్న పాస్‌ల వివరాలు

డిపో	ఉచిత పాస్‌లు	రాయితీ పాస్‌లు	పీహెచ్‌సీ పాస్‌లు
భీమవరం	6,056	10,966	319
నర్సాపురం	2,239	6,367	513
తాడేపల్లిగూడెం	2,142	6,122	506
తణుకు	1,266	4,705	347

బస్ పాసుల మంజూరుకు చర్యలు



కళాశాలలు, స్కూళ్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొత్త బస్ పాస్‌లు మంజూరు, పాత పాస్‌లు రెన్యువల్ చేసి విద్యార్థులకు వేగంగా అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. 50 కిలోమీటర్ల పరిధివరకూ రాయితీ పాస్‌లు జారీ చేస్తాం.

– వరప్రసాదరావు, జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి భీమవరం

న్యూస్‌రీల్

వ్యవసాయ మంత్రిని కలిసిన వైస్ చాన్సలర్



కింజరాపు అచ్చెన్నాయుడును కలిసిన ఉప కులపతి

తాడేపల్లిగూడెం : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును వెంకట్రామన్నగూడెం వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి ఉత్పత్తుల కిట్, పుష్పగుచ్ఛం అందజేశారు. విశ్వ విద్యాలయం ప్రగతి, ప్రస్తుతం జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డీవీ స్వామి కలిసిన వారిలో ఉన్నారు.

లోక కల్యాణార్థం శ్రీరుద్రయాగం



హోమాలు, క్రతువులు చేస్తున్న అర్చకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : లోక కల్యాణార్థం స్థానిక శంకరమఠంలో నిర్వహిస్తున్న శ్రీరుద్రయాగంలో ఆదివారం స్వామి వారికి మహానివేదన జరిగింది. దేవస్థానం పవిత్రోత్సవాలలో భాగంగా ఉమాచంద్ర మౌళీశ్వరస్వామికి, సర్వమంగళ అమ్మవారికి, ఆదిశంకరాచార్యలకు విశేష పూజలు నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, రుద్రయాగ క్రతువులో ఇరవైమంది వేద పండితులు పాల్గొని శతరుద్రీయం, అవాహిత హోమాలు, మండప పునఃపూజలు, రుద్రవావనం, సుందరకాండలు జరిగాయి. పాలకొల్లు వాస్తవ్యులు బాలసుందర్ భాగవతార్చే విరాట పర్వం హరికథ నిర్వహించారు. దీక్షాదారులు ప్రయాగ కిషోర్, జ్యోస్యుల పాండురంగ శాస్త్రి పర్యవేక్షించారు.

మసీదుల వద్ద బందోబస్తు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రధాన మసీదులు, దర్గాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని డీఎస్పీ డీఎస్ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యంలు తెలిపారు. ముస్లింలతో నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ముస్లింలు తప్పక మత సామరస్యాన్ని కాపాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పారు.

బీచ్‌లో సందర్శకుల సందడి



మొగల్తూరు : తీరంలోని కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లు ఆదివారం సందర్శకులతో కిక్కిరిశాయి. ఆదివారం వాతావరణం వేడిగా ఉండటంతో పాటు ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో బీచ్‌కు వచ్చిన పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ గడిపారు. ఎగిసి పడుతున్న అలలతో హుషారుగా, ఉల్లాసంగా, గడిపారు. అనంతరం తీరంలోని ఆలయాలను దర్శించారు.

హాల్టులు పునరుద్ధరించాలి



భీమవరంలో కేంద్ర మంత్రి వర్మకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: అత్తిలి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌ను ఎత్తివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అత్తిలిలో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు అత్తిలికి చెందిన పలువురు వినతిపత్రం అందజేశారు. ఆదివారం భీమవరంలోని ఆయన క్యాంపు కార్యాలయానికి వెళ్లి రైల్వేస్టేషన్ సమస్యలు వివరించారు. అత్తిలి రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించినా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపకపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. ప్యాసింజర్ రైళ్లు రాజమహేంద్రవరం వరకూ పొడిగించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలి



గ్రామీణ యువత-వలసలు-నిరుద్యోగంపై మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఏలూరు (టూటౌన్): వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఏలూరులో మూడు రోజుల పాటు జరుగుతున్న రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం గ్రామీణ యువత–వలసలు–నిరుద్యోగం అనే అంశంపై ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ ఆధారిత, సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలను నెలకొల్పి, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసినప్పుడే వలసలను అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. పీడీఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేయకుండా పాలకవర్గాలు యువతను దగా చేస్తున్నాయన్నారు. భూమి సమస్య–సామాజిక న్యాయం అంశంపై రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.సునీత అధ్యక్షత వహించగా దళిత బహుజన మహాసభ నాయకులు వై.కోటేశ్వరరావు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజలకు భూమి దక్కాలని దాని కోసం పోరాడాలన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



తాడేపల్లిగూడెంలో మేఘావృతమైన ఆకాశం



తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి గ్రామంలో రోడ్డుపై వెళ్తున్న కారుపై పడిన విద్యుత్ స్తంభం

తాడేపల్లిగూడెం(టీఓసీ)/తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణం, మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. చినతాడేపల్లి గ్రామంలో విద్యుత్ స్తంభం నేలకొరిగి రోడ్డుపై వెళుతున్న కారుపై పడింది. అప్పటికే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పిందని, కారులోని వారికి ఎటువంటి ప్రాణాపాయం సంభవించలేదని కుంచనపల్లి సబ్‌స్టేషన్ ఏఈ అల్లు రామకృష్ణ తెలిపారు.

కొండెక్కిన కోడి

- ఒక్కసారిగా పెరిగిన చికెన్ ధర
- వడగాలులతో తగ్గిన కోళ్ల ఉత్పత్తి



తణుకు: చికెన్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఎండల తీవ్రత కారణంగా ఉత్పత్తి తగ్గడంతోపాటు ఇటీవల వీచిన వడగాల్పులతో కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో ఒక్కసారిగా చికెన్ ధర కొండెక్కి కూర్చుంది. 15 రోజుల క్రితం వరకు కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.160, స్కిన్ చికెన్ రూ.140 ధర పలకగా ప్రస్తుతం తణుకు మార్కెట్‌లో స్కిన్‌లెస్ రూ.300 వరకూ విక్రయిస్తున్నారు. ఈ ధరలు చూసి కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో వ్యాపారాలు సరిగా సాగడంలేదని మాంసం దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండుటెండలకు బ్రాయిలర్ కోళ్లు చనిపోవడం, తగినంత దాణా తీసుకోకపోవడం వంటి కారణాలతో చికెన్ ధరలకు రెక్కలు వస్తున్నాయి. దీంతో అమ్మకాలు గణనీయంగా తగ్గుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

పోటాపోటీగా ధర

గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు తారాస్థాయికి చేరాయి. రుతుపవనాలు ప్రవేశించి రెండు వారాలు గడిచినప్పటికీ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో కోళ్ల ఉత్పత్తి తగ్గింది. పౌల్ట్రీ ఫారాల్లో పెంచుతున్న కోళ్లు వడగాలులకు తట్టుకోలేక మృత్యువాత పడుతున్నాయి. పౌల్ట్రీ రైతులు ఏప్రిల్, మే నెలల్లో వీటి ఉత్పత్తికి వెనుకంజ వేస్తూ వచ్చారు. ఫలితంగా కోళ్ల ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో ధరలు పెరిగాయి. సాధారణంగా రెండు కిలోల కోడి తయారు కావడానికి 40 రోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం వేసవి కావడంతో మేత సరిగ్గా తినకపోవడంతో 60 రోజులు పడుతోంది. ఈ పరిస్థితుల్లో అనుకున్న సమయానికి కోళ్ల ఉత్పత్తి కావడంలేదు. దీనికి తోడు ఫారాల్లో 10 నుంచి 15 శాతం కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పౌల్ట్రీరైతులు నష్టాలబాట పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ధరలు పెంచుతున్నారు. గతంలో లైవ్ చికెన్ ధర కిలో రూ.90 ఉండగా ప్రస్తుతం రూ.220 పలుకుతోంది.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ బి.లావణ్యవేణి, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తదితరులు

పోలవరం రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేయాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆదేశించారు. ప్రాజెక్టు ప్రాంతంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ముఖ్యమంత్రి పర్యటిస్తున్నారని విజయవంతం చేయాలన్నారు. ఎవరికి అప్పగించిన పనులు వారు నిర్వర్తించాలన్నారు. పనుల పరిశీలన అనంతరం అధికారులతో సమీక్షిస్తారన్నారు. ముఖ్యమంత్రి పనులు పరిశీలించే ప్రదేశంలో పూర్తి వివరాలు అందజేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రాజెక్టు ప్రాంతంలో బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదివారం పరిశీలించారు. ఏర్పాట్లను జలవనరుల శాఖ సీఈ నరసింహమూర్తి పరిశీలించారు. వీరి వెంట ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ, డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ఏలూరు(మెట్రో): ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్ట్ సందర్శన నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టామని గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. లైవ్ శానిటేషన్ అమలులోకి తెస్తున్నట్లు చెప్పారు. 150 మంది శానిటేషన్ కార్మికులను పారిశుద్ధ్య కార్యక్రమాలకు వినియోగించగా 80 మంది పంచాయతీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని అన్నారు.

దివ్యాంగుల భవితకు భరోసా

- ఉచిత ఉపకరణాల పంపిణీకి లబ్ధిదారుల గుర్తింపు
- 18 నుంచి జూలై 2 వరకు నియోజకవర్గాల్లో శిబిరాలు



కై కలూరు: జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలకు ఉచిత ఉపకరణాల పంపిణీ నిమిత్తం దివ్యాంగ నిర్ధారణ వైద్య శిబిరాలు మంగళవారం నుంచి జరగనున్నాయి. జిల్లా సమగ్రశిక్ష చైర్మన్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో ఏలూరు జిల్లా 7 నియోజకవర్గాల్లో శిబిరాలు నిర్వహించనున్నారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు చేసి బాలబాలికలకు ఉచిత ఉపకరణాల పంపిణీకి సిఫార్సు చేస్తారు. ఏలూరు జిల్లాలో 28 భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయి. ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే ఎలిమెంటరీ, సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల్లో 6–18 సంవత్సరాల ప్రత్యేక అవసరాల కలిగిన బాలబాలికలకు పరికరాలు అందిస్తారు. ఇటీవల జిల్లాలో సర్వే చేసి ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలను 724 మందిని గుర్తించారు. ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించి శిబిరాల షెడ్యూల్ విడుదల చేశారు.

శిబిరాల వివరాలు

- జూన్ 18న పోలవరం నియోజకవర్గంలో బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, పోలవరం, టీ.నరసాపురం, వేలేరుపాడు, కొయ్యలగూడెం మండలాలకు బుట్టయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిబిరం.
- జూన్ 20న చింతలపూడి నియోజకవర్గంలో చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, లింగపాలెం మండలాలకు సంబంధించి చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిబిరం
- జూన్ 22న నూజివీడు నియోజకవర్గంలో అగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు, నూజివీడు మండలాలకు నూజివీడు ఎస్ఆర్ఆర్ ఉన్నత పాఠశాలలో
- జూన్ 25న కై కలూరు నియోజకవర్గంలో కై కలూరు, కలిదిండి, మండవల్లి మండలాలకు కై కలూరు భవిత కేంద్రంలో శిబిరం
- జూన్ 27న ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు, గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, ద్వారకతిరుమల మండలాలకు సంబంధించిన ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిబిరం
- జూన్ 29న దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు, పెదపాడు, పెదవేగి మండలాలకు సంబంధించి దెందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో
- జూలై 2 మంగళవారం జిల్లా ప్రధాన కేంద్రం ఏలూరుకు సంబంధించి అశోక్‌నగర్ భవిత కేంద్రంలో శిబిరం జరుగుతుంది.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తోంది. వైద్య శిబిరాల్లో నైపుణ్యం కలిగిన వైద్యులు పరీక్షలు చేసి దివ్యాంగులను గుర్తిస్తారు. వారి అవసరాల నిమిత్తం ఉచిత పరికరాలను అందిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సోమశేఖర్, సమగ్రశిక్ష, అదనపు పథక సమన్వయకర్త, ఏలూరు జిల్లా

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ



వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండిపోవడంతో బయట బారులు తీరిన భక్తులు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం సైతం వేలాది మంది భక్తులు స్వామిని దర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అనివేటి మండపం, జంటగోపురాలు, తూర్పురాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, అన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. దర్శనం క్యూలైన్లు, క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోవడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయ ఆవరణలో బారులు తీరారు. భక్తుల వాహనాలతో పార్కింగ్ ప్రదేశాలు, ఘాట్ రోడ్లు నిండిపోయాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. దర్శనం టికెట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా స్వామివారికి రూ. 32 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

పంచాయతీ కార్మికులపై వేధింపులు అడ్డుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

భీమవరం: ప్రభుత్వాలు మారినప్పుడల్లా పంచాయతీ కార్మికులపై వేధింపులు పెరుగుతున్నాయని కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వేధింపులను అరికట్టి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా ఆఫీసులో జరిగిన సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ రాజారెడ్డి అధ్యక్షత వహించారు. రాజారెడ్డి, రాష్ట్ర కమిటీ నాయకుడు ఇంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ట్యాంకు వాచర్లు, ఎలక్ట్రీషియన్లు, అటెండర్లు, స్వీపర్లు, గ్రీన్ అంబాసిడర్ పనులు నిర్వహిస్తున్న కార్మికులు కనీస వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా గ్రామీణ ప్రాంతాలలో వీరి మీద రాజకీయ వేధింపులు తీవ్రమవుతున్నాయన్నారు. వీరి సమస్యలు పట్టించుకున్న నాథుడు కనపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. పంచాయతీ రాజ్ మంత్రిని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

క్లుప్తంగా

చీరాల బీచ్‌లో నూజివీడు యువకుడి గల్లంతు



కోసూరి కార్తీక్

నూజివీడు: చీరాల బీచ్‌లో నూజివీడుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కోసూరి కార్తీక్ (19) ఆదివారం గల్లంతయ్యాడు. కాలేజీకి సెలవులు అయిపోతుండటంతో పట్టణానికి చెందిన స్నేహితులు 10 మందితో కలిసి వాహనంలో ఉదయం 6 గంటలకు చీరాల బీచ్‌కు వెళ్లారు. అక్కడ 10.30 గంటల సమయంలో సముద్రంలో స్నానానికి దిగారు. వీరిలో ఇద్దరు అలల ధాటికి సముద్రం లోపలికి కొట్టుకుపోతుండగా ఒకరిని పట్టుకుని లాగడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. కోసూరి కార్తీక్ మాత్రం సముద్రంలో గల్లంతయ్యాడు. వీరందరూ మైలవరంలోని ఎల్‌బీఆర్‌సీఈలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసి తృతీయ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నారు. విషయం తెలిసిన వెంటనే పిల్లల తల్లిదండ్రులందరూ చీరాల బయలుదేరి వెళ్లారు. కార్తీక్ తండ్రి కోసూరి పూర్ణ ఆర్టీఏ ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. ఒక్కగానొక్క కొడుకు గల్లంతవడంతో కుటుంబంతో పాటు బంధుమిత్రులందరూ విచారంలో మునిగిపోయారు.

కొనసాగిన సీపీఎఫ్ ఉద్యోగుల దీక్షలు



సరిపల్లె సీపీఎఫ్ కంపెనీ వద్ద నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తమకు న్యాయం జరిగేవరకూ ఆందోళన కొనసాగిస్తామని ఉద్యోగుల పోరాట సమితి తెలిపింది. ఆదివారం పదో రోజు సీపీఎఫ్ కంపెనీ మెయిన్‌గేటు వద్ద ఉద్యోగులు నిరాహార దీక్షలు కొనసాగించారు. లాభాలలో ఉన్న కంపెనీని అన్యాయంగా మూసివేసి తమకు తీరని అన్యాయం చేసిందని, కంపెనీలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ కంపెనీ ఉద్యోగులు మూడు రోజులుగా కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని నినాదాలు చేశారు.

కన్నులపండువగా కుంకుళ్లమ్మకు నవకలశ స్నపన

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు




కుంకుళ్లమ్మకు స్నపనను నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: క్షేత్రదేవత శ్రీకుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం నుంచి ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 9 గంటలకు అమ్మవారి మూలవిరాట్‌కు, అలాగే ఉత్సవ మూర్తులకు నవకలశ స్నపనను అర్చకులు, పండితులు వేద మంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. అనంతరం శ్రీచక్రార్చన, సప్తశతి పారాయణ, హోమాలను జరిపారు. మహా పూర్ణాహుతి వేడుకను నేత్రపర్వంగా జరిపారు. ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

త్యాగాలకు ప్రతీక.. బక్రీద్

- రంజాన్ తరువాత ఈ పండుగకే అధిక ప్రాముఖ్యం
- నేడు బక్రీద్ పండుగ.. ఊరూరా ముస్తాబైన మస్జిద్‌లు
- ముస్లింల సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



మక్కాలోని కాబా చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ముస్లింలు (ఫైల్)



చింతలపూడిలో ముస్తాబైన మస్జిద్

చింతలపూడి: ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో బక్రీద్ ఒకటి. ధనిక, పేద తారతమ్యం లేకుండా ప్రతి ముస్లిం బక్రీద్ పండుగను జరుపుకుంటారు. పవిత్ర త్యాగానికి ప్రతిరూపమైన దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లాహ్ ప్రసన్నం కోసం చేసిన మహోన్నత త్యాగాన్ని ఈ పండుగ సందర్భంగా ముస్లింలు స్మరించుకుంటారు. ఇస్లాం మతంలో రంజాన్ తరువాత అంత ప్రాముఖ్యత ఉన్న పండుగ ఈదుల్ జుహా (బక్రీద్). దీన్నే త్యాగాల పండుగ అని కూడా ముస్లింలు పిలుచుకుంటారు. సోమవారం దేశవ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకోనున్నారు. ఈ పండుగ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఒక గొర్రె పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని నిరుపేదలకు పంచి పెడతారు. మిగిలిన భాగాలలో రెండో దాన్ని బంధువులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. దీన్నే ఖుర్బానీ అంటారు. ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేపడతారు. పవిత్ర స్థలం మక్కాను సందర్శించడానికి ఇష్టపడతారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరానికి వెళ్లి మస్జిద్-అల్-హరామ్‌లోని కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణాలు చేస్తారు. బక్రీద్ పండుగ రోజు ముస్లింలు అందరూ ఈద్‌గాహ్‌కు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేస్తారు.

పండగ సందడి షురూ..

త్యాగనిరతికి ప్రతీకగా ముస్లింలు జరుపుకునే బక్రీద్ సందడి జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మొదలైంది. పండుగ సందర్భంగా పొట్టేళ్లు, గొర్రెలు, మేకల విక్రయాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఖుర్బానీ ఇవ్వడం కోసం ఇప్పటికే కొందరు హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా పొట్టేళ్లను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. మరికొద్ది మంది తాడేపల్లిగూడెం, గుంటూరు, మచిలీపట్నం, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి ఖుర్బానీ కోసం సిద్ధం చేసుకున్నారు. స్థానికంగా కూడా కొందరు వ్యాపారులు ఏడాది పొడవునా పొట్టేళ్లను పెంచి విక్రయిస్తుంటారు. ఒక్కో పొట్టేలు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ధర పలుకుతోందని వ్యాపారులు తెలిపారు. జిల్లాలోని ఏలూరు, నూజివీడు, తాడేపల్లిగూడెం, తణుకు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, ఆకివీడు, పోలవరం తదితర ప్రాంతాల్లో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకుంటారు. బక్రీద్ సందర్భంగా జిల్లాలోని సుమారు రూ.5 కోట్లకు పైగా పొట్టేళ్ల వ్యాపారం జరుగుతుందని అంచనా.

పొట్టేళ్లకు గిరాకీ

బక్రీద్ వస్తోందంటే పొట్టేళ్లకు గిరాకీ పెరుగుతుంది. వారం ముందు నుంచే మెట్ట ప్రాంతంలో కొత్తబట్టలు, పండుగ సామగ్రి కొనుగోలు చేశారు. ఖుర్బానీ ఇవ్వడానికి గొర్రెలు, మేకలను దూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. పండుగ అయిపోయిన తరువాత కూడా నెల మొత్తం ఖుర్బానీ ఇచ్చుకునే అవకాశం ఉండటంతో పొట్టేళ్ల అమ్మకాలు కొనసాగనున్నాయి.

ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ



బక్రీద్ సందర్భంగా ప్రతి ముస్లిం విధిగా పొట్టేలు మాంసాన్ని ఖుర్బానీ ఇచ్చి పేదలకు పంచడం ఆనవాయితీ. అలాగే ఈ పండుగ సందర్భంగా ముస్లింలు తమ జీవిత కాలంలో ఒక్కసారైనా అతి పవిత్రమైన మక్కాను సందర్శించి ముక్తిని పొందాలి.

– మహమ్మద్ అబ్దుల్ వదూద్, జామియ మస్జిద్ ఇమామ్

త్యాగ నిరతిని తెలియజేస్తుంది



బక్రీద్ పండుగ మనిషికి దైవభీతిని, త్యాగ నిరతిని తెలియజేస్తుంది. అందుకే ఈ పండుగను త్యాగాల పండుగ అంటారు. అంతే కాకుండా చనిపోయిన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని వారి పేరున ఖుర్బానీ ఇవ్వడం ఈ పండుగ ప్రత్యేకత.

– సయ్యద్ బాబు, జామియ మస్జిద్ అధ్యక్షులు, చింతలపూడి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

యలమంచిలి: కాజ బైపాస్ రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పెనుగొండకు చెందిన కందికట్ల నవీన్ కుమార్ (17) శనివారం తన స్నేహితులు గుమ్మడి చినరాజా, గొట్టుముక్కల పవన్‌తేజతో కలిసి బంధువులు ఇంటికి అంబేడ్కర్ కొనసీమ జిల్లా మలికిపురం మండలంలోని రామరాజులంక వెళ్లారు. అక్కడ నుంచి తెల్లవారుజామున మూడు గంటలకు తిరిగి ప్రయాణమయ్యారు. మార్గ మధ్యలో కాజ బైపాస్ వద్ద నిద్ర మత్తు వలన ఎదురుగా వస్తున్న చిన్న కారును ఢీ కొట్టారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం ఆరు గంటల సమయంలో నవీన్‌కుమార్ మరణించాడు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. నవీన్‌కుమార్ మేనమామ రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాకి శివ నారాయణ చెప్పారు.

ప్రజల ఆకాంక్షల మేరకు పాలన



మంత్రి పార్థసారథికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

నూజివీడు: ప్రజల ఆకాంక్షల మేరకు పాలన అందిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎన్నికల అనంతరం మంత్రి పదవి పొంది తొలిసారి నూజివీడుకు వస్తున్న సందర్భంగా ఆదివారం సాయంత్రం మండలంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ జంక్షన్‌లో అభయాంజనేయ స్వామిని దర్శనం అనంతరం మర్రిబంధం నుంచి మీర్జాపురం, గొల్లపల్లి, మొర్సపూడి, తుక్కులూరు మీదుగా నూజివీడు వరకు ర్యాలీ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రజలు ఘనవిజయాన్ని అందించారన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి తాను శాయశక్తులా కృషి చేస్తానని, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి పేదవాడికీ అందిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో మంత్రిని సన్మానించారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో..

పెదపాడు: అప్పనవీడులో వేంచేసియున్న అభయాంజనేయస్వామివారిని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం దర్శించుకున్నారు. తొలుత అర్చకులు ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలుకగా, అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రికి స్వామివారి శేషవస్త్రం కప్పి, స్వామివారి జ్ఞాపికలను అధికారులు అందజేశారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పడాలలో వ్యక్తి దారుణ హత్య



కొప్పర్తి రాంబాబు (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్: పాతగొడవల నేపథ్యంలో పడాలలో శనివారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురి కాగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పడాల గ్రామానికి చెందిన కొప్పర్తి రాంబాబు (49)కు అదే గ్రామానికి చెందిన లింగంపల్లి ఉమాశేఖర్ మణికంఠ అలియాస్ బాబికి మధ్య సొమ్ముల విషయంలో పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో బాబి శనివారం రాత్రి బాకీ సొమ్ములు ఇవ్వాలని, లేకుంటే మీ అంతు చూస్తానంటూ రాంబాబును బెదిరించాడు. దీంతో రాంబాబు మేనమామ జోక్యం చేసుకుని త్వరలోనే డబ్బులు ఇచ్చేస్తామని సర్ది చెప్పే ప్రయత్నం చేయగా బాబి వెంట తెచ్చిన గొడ్డలితో, మరో వ్యక్తి లింగంపల్లి నర్సయ్య కొడవలితో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో రాంబాబుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వీరిని అడ్డుకునే ప్రయత్నంలో కొత్త శ్రీనివాస్, కొత్త సరస్వతీలకు గాయాలయ్యాయి. ఈ మేరకు కొత్త వంశీకిరణ్ ఇచ్చిన ఫిర్యాదుపై తాడేపల్లిగూడెం రూరల్ ఎస్సై పి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి పథకాలకు రూ.5 లక్షల విరాళం



దాత రోజారమణికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలోని పలు పథకాలకు కొందరు భక్తులు ఆదివారం రూ.5,01,232 లను విరాళంగా అందజేశారు. ఒక అజ్ఞాత భక్తుడు విమానగోపుర స్వర్ణమయ పథకానికి రూ.3 లక్షలు అందించగా, బొప్పన సురేష్ అనే భక్తుడు నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు, సికింద్రాబాద్‌కు చెందిన వారణాసి ఆదిశేషు నిత్యాన్నదాన పథకానికి రూ.50,116లను, అలాగే ఉండ్రాజవరం మండలం పాలంగికి చెందిన అల్లక రోజారమణి ప్రాణదాన ట్రస్టుకు రూ.1,01,116 లను అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాలను అందించి, స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

విద్యుదాఘాతానికి కూలీ మృతి

చింతలపూడి: ఆయిల్‌పామ్ గెలలు కోస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ కూలీ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మేడిశెట్టివారిపాలెం గ్రామానికి చెందిన దారబోయిన శ్రీనివాసరావు (32) కూలి పనులు చేసుకుని జీవిస్తుంటాడు. ఆదివారం ఆయిల్‌పామగెలలు కోసే పనికి వెళ్లాడు. గెలలు కోస్తుండగా కత్తి విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చింతలపూడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఎస్సై కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

చింతలపూడి: పోతునూరులో పాము కాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తల్లపనేని వెంకటేశ్వరరావు (77) ఆదివారం గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి కుళాయిలకు నీటిని వదలడానికి వెళ్లాడు. ఆ సమయంలో పాము కాటు వేయగా, ఇంటికి చేరుకుని సొమ్మసిల్లి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రేక్ ఫెయిల్.. నిలిచిన ఆర్టీసీ బస్సు



ఎల్ఎన్‌డీపేట సమీపంలో నిలిచిన ఆర్టీసీ బస్సు

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలో జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బ్రేక్ ఫెయిలై నిలిచిపోయింది. జంగారెడ్డిగూడెం నుంచి పోలవరం వస్తున్న ఈ బస్సు ఆదివారం సాయంత్రం ఎల్ఎన్‌డీపేట వచ్చేసరికి పూర్తిగా బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో డ్రైవర్ బస్సును పక్కకు నిలిపివేశారు. అదే సమయంలో వర్షం పడుతుండడంతో బస్సులోని ప్రయాణికులు తడుచుకుంటూ కొందరు ఆటోల్లో, మరికొందరు మోటార్‌సైకిళ్లపై గమ్యానికి చేరుకున్నారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ



పెన్మెత్స శ్రీఆన్స్‌వర్మ

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణానికి చెందిన పెన్మెత్స శ్రీఆన్స్‌వర్మ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. భీమవరంలో జరిగిన ఆర్చరీ పోటీల్లో అండర్ -10 విభాగంలో శ్రీఆన్స్‌వర్మ ప్రతిభ కనబరిచారు. శ్రీఆన్స్‌వర్మ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో యూకేజీ చదువుతున్నాడు. రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు ఈ నెల 23న విజయవాడలో నిర్వహించనున్నట్లు భీమవరం ఒల్గా ఆర్చరీ అకాడమీ అధికారులు తెలిపారని శ్రీఆన్స్‌వర్మ తల్లిదండ్రులు తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువుగా నవధాన్యాల సాగు

- పైరుకు పుష్కలంగా పోషకాలు లభ్యత
- భూసారం మెరుగు పడి పంటకు దోహదం
- అధికారుల ప్రోత్సాహంతో రైతుల్లో ఆసక్తి



చెక్కపల్లిలో ఓ రైతు పొలంలో ఏపుగా పెరిగిన నవధాన్యాల పచ్చిరొట్టను పరిశీలిస్తున్న సిబ్బంది

ముసునూరు: రసాయన ఎరువుల వాడకంతో భూసారం క్షీణించడంతో పాటు పర్యావరణ కాలుష్యంతో రైతులకు సాగు ఖర్చు పెరగడమే కాక దిగుబడులపై కూడా ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో నేల ఆరోగ్యం, ఉత్పాదక శక్తి పెంపు, సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన పెరగడంతో పచ్చిరొట్ట సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు పశువుల ఎరువులు, వర్మీ కంపోస్ట్ కొరత, ధరలు అధికమవడంతో రైతులు పచ్చిరొట్ట ఎరువుగా నవధాన్యాల సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. దీనికి అనుగుణంగానే ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు నవధాన్యాల పంటల సాగుపై అవగాహన కల్పించి, విత్తనాలు అందించి రైతులను ప్రోత్సహిస్తున్నారు.

నవ ధాన్యాల్లో రకాలు: వరి, గోధుమ, ఉలవ, అనుములు, పెసలు, కందులు, మినుములు, శెనగలు, నువ్వులు. వీటితోపాటు పచ్చిరొట్ట కోసం జొన్నలు, మొక్కజొన్నలు, సజ్జలు, జనుము, జీలుగ, పిల్లిపెసర, రాగులు, తదితర చిరుధాన్యాలు కూడా పచ్చిరొట్ట సాగు కోసం వినియోగించుకోవచ్చు.

ప్రయోజనాలివే..

- నేల నిర్మాణాన్ని మెరుగుపరుస్తుంది. నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది. నేల కోతను నివారించి నష్టాన్ని తగ్గిస్తుంది
- నవధాన్యాల విత్తనాలు ఎక్కువ రకాలుగా చల్లడం వలన మొక్కలు సన్నగా ఎదిగి, నేలలో కలియ దున్నినపుడు వేగంగా కుళ్లి, నేలలో కలిసిపోతాయి
- నేలలో సేంద్రియ కర్బనం పెరుగుతుంది
- నేలలో ఉండే ప్రయోజనకర సూక్ష్మజీవుల సంఖ్యను మెరుగుపరుస్తుంది.
- వేర్లు భూమిలో ఎక్కువ లోతుకు వెళ్లడం వల్ల నేలను అధికంగా గుల్లబారేలా చేస్తుంది.
- రసాయన ఎరువుల వాడకాన్ని 35 నుంచి 45 శాతం వరకు తగ్గించడంలో సహాయపడతాయి.



ముసునూరులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



నవధాన్య విత్తనాలు

- కలుపు మొక్కలను తగ్గించడంలో సహాయపడతాయి.
- పశువుల మేతగా కూడా వాడుకోవచ్చు.

నవ ధాన్యాలను విత్తుకుని, కలియదున్నే సమయాలు

- వేసవిలో ఏప్రిల్, మే నెలల్లో ఖరీఫ్ పంటలు వేసే ముందు, రెండు పంట కాలాల మధ్య, ఒకటి, రెండు వర్షాలు కురిసిన తర్వాత విత్తనాలు విత్తుకోవాలి. విత్తిన తర్వాత 60 నుంచి 80 రోజుల వరకు ఏపుగా పెంచి, పూత, పిందె దశలో పంట జీవ పదార్థాన్ని కలపడానికి, కుళ్లిపోవడానికి నేలలో కలియదున్నాలి.
- పొలంలో నవధాన్యాల పచ్చిరొట్టను కలిపే విధానం
- పళ్లెపు నాగలితో పంటకు 60–80 రోజుల వ్యవధి వచ్చినపుడు నవధాన్యాల రొట్టను కలియదున్నడం వలన మట్టిలో బాగా కలిసిపోతుంది.
- రోటవేటర్‌ను ఉపయోగిస్తే జీవ పదార్థం వేగంగా కుళ్లిపోతుంది.

పోషకాలు పుష్కలం



నవధాన్యాల పచ్చిరొట్టను పెంచి పొలంలో కలియదున్నడం ద్వారా పుష్కలమైన పోషకాలు పంటకు అందుతాయి. దీని వల్ల పంట సాగు ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధిస్తారు. ప్రకృతి సేద్యం విభాగం ద్వారా నవ ధాన్యాల విత్తన పంపిణీ కొనసాగుతోంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సందిపాము మధుమోహన్, మండల వ్యవసాయాధికారి

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం

ఉండి: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెలివర్రు గ్రామానికి చెందిన గండికోట రామస్వామి (25) అనే వ్యక్తి కొంత కాలంగా కేరళలో ఉంటున్నాడు. ఈ నెల 14న స్వగ్రామం వెలివర్రుకు భార్యతో కలిసి వచ్చాడు. అయితే 16వ తేదీన భార్య చర్చికి వెళ్లిన తరువాత ఇంట్లో దూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య చర్చి నుంచి తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లో ఉరి వేసుకుని వేలాడుతూ ఉండటాన్ని గమనించిన ఆమె బంధువుల సహాయంతో 108 ద్వారా భీమవరం ప్రభుత్వసుపత్రికి తరలించారు. అతనిని పరీక్షించిన వైద్యులు అప్పటికే రామస్వామి మరణించినట్లు నిర్ధారించారు. రామస్వామి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు. మృతుని తమ్ముడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సమీపంలోని ఆటోనగర్ రైల్వే బ్రిడ్జి వద్ద రైలు నుంచి జారిపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తికి 40 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉండవచ్చని, ఎత్తు 5.5 అడుగులు, కోల ముఖం, నలుపు, తెలుపు జుట్టు కలిగి ఉన్నాడన్నారు. ఆలివ్‌గ్రీన్ రంగు పొట్టి చేతుల టీషర్ట్, నలుపు రంగు లోయర్ ధరించి ఉన్నాడని, మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు 95020 97672 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పలు చోట్ల అగ్ని ప్రమాదాలు

ఆకివీడు: మండలంలో పలు చోట్ల ఆదివారం అగ్నిప్రమాదాలు జరిగాయి. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ పోల్ నుంచి నిప్పురవ్వలు చెలరేగడంతో సబ్ స్టేషన్ చుట్టుపక్కల ఉన్న గడ్డి, చెత్త దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి మంటల్ని అదుపుచేశారు. ఈ ఘటనలో సుమారు రూ.5 వేలు నష్టం వాటిల్లిందని, రూ.10 లక్షల మేర ఆస్తిని కాపాడినట్లు అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు చెప్పారు. స్థానిక జానకమ్మ ఆసుపత్రి వద్ద ఆర్ అండ్ బీ బంగళాలో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.10 వేలు నష్టం వాటిల్లిందని చెప్పారు. అలాగే కోళ్ళపర్రు గ్రామంలో కాల్చిపారేసిన సిగరెట్ నుంచి నిప్పు చెలరేగి పీ.నారాయణకు చెందిన రెండెకరాల గడ్డివాము దగ్ధమై రూ.5 వేలు నష్టం జరిగిందని తెలిపారు. సమీపంలో కిక్కిసకు నిప్పంటించడంతో మంటలు చెలరేగి గడ్డివాము దగ్ధమైందని నాగేశ్వరరావు వివరించారు.

జాషువా నియామకంపై హర్షం

కైకలూరు: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ప్రధాన కార్యదర్శిగా గొటుకుల జాషువా నియమితులయ్యారు. ఈ మేరకు వేదిక రాష్ట్ర అధ్యక్షులు గరికిముక్కు సుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. వదర్లపాడుకు చెందిన జాషువా సైనికుడిగా పని చేసిన అనంతరం గుంటూరులో స్థిరపడ్డారు. సమరసత సేవా ఫౌండేషన్ కైకలూరు మండల కన్వీనర్‌గా, కృష్ణా జిల్లా ఎస్సీ, ఎస్టీ హక్కుల వేదిక అధ్యక్షునిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా సేవలు అందించారు. ఎస్సీ ఎస్టీలో ఉన్న అన్ని ఉప కులాలకు ప్రభుత్వాల సంక్షేమ ఫలాలు అందేందుకు కృషి చేస్తానన్నారు. జాషువాకు పదవి రావడంపై న్యాయవాది పాములు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

23న కుట్టు శిక్షణ శిబిరం



బల్లిపాడు ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దండు పద్మావతి, పీఠం సభ్యులు

అత్తిలి: ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ దండు పద్మావతి కోరారు. డాక్టర్ దండు పద్మావతి సౌజన్యంతో స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కుట్టు శిక్షణలో మహిళలకు ఆదివారం ఆశ్రమ ప్రాంగణంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుట్టు శిక్షణలో మొదటి బ్యాచ్ 30 మంది మహిళలకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ నెల 23న శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి ఉమర్ ఆలీషా రెండవ విడత కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో పలు మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో పీఠం జిల్లా కమిటీ సభ్యుడు ఏఎస్.వెంకటరత్నం, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మంత్రి సుభాష్



తణుకులో ఎమ్మెల్యేతో భేటీ అయిన మంత్రి సుభాష్

తణుకు: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి సుభాష్‌ను ఎమ్మెల్యే రాధాకృష్ణ సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కలగర వెంకటకృష్ణ, బసవా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఏపీటీఎఫ్ శుభాకాంక్షలు

తణుకు అర్బన్: స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను ఏపీటీఎఫ్ తణుకు జోన్ ఉపాధ్యాయులు ఆదివారం పార్టీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్, నాయకులు వీ.రామమోహన్, కే.రామప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి సత్కారం



శ్రీనివాసవర్మను సత్కరిస్తున్న పేరిచర్ల మురళీకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్ మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సభ్యులు భీమవరంలో ఆదివారం పార్లమెంట్ సభ్యులు, కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను ఆయన నివాసంలో కలిసి శాలువతో సత్కరించారు. స్వామి వివేకానంద ప్రతిమను బహూకరించారు. కేంద్ర మంత్రిగా దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావడమే కాకుండా రాష్ట్ర అభివృద్ధికి పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో కాళ్ల గోపీకృష్ణ, మహ్మద్ అహ్మద్, వెంకటరత్నాజీ, ఏపూరి సాయి తదితరులు పాల్గొన్నారు.

వీజేఎఫ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



వాసవి జాగృతి క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకార దృశ్యం

భీమవరం: వాసవి జాగృతి (వీజేఎఫ్) క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం భీమవరం ప్యాడి–రైస్ మర్చంట్ భవనంలో ఆదివారం నిర్వహించారు. క్లబ్ ఫౌండర్ ప్రెసిడెంట్ తిరివీధి వేణుగోపాల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. వాసవి జాగృతి (వీజేఎఫ్) భీమవరం క్లబ్ అధ్యక్షుడిగా పర్రిపాటి బీబీఎస్ఎన్ గుప్త (పర్రిపాటి శ్రీను), కార్యదర్శిగా సబ్బిశెట్టి శ్రీనివాస్ గణేష్, కోశాధికారిగా సంకా అనంత గోపాలం (సంకా గోపి) నియమితులయ్యారు. ఈ సందర్భంగా తిరివీధి వేణుగోపాల్ మాట్లాడుతూ వాసవి జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో కుల మతాలకతీతంగా ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తూ, శాంతి, సహనం, స్నేహం వంటి ఆశయాలతో ముందుకు సాగుతుందని, క్లబ్ విధి విధానాలను తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన క్లబ్ అధ్యక్షుడు పర్రిపాటి శ్రీను మాట్లాడుతూ నూతన సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నాగసూరి మురళీమోహన్‌రావు, పువ్వాడ మూర్తి, ఉప్పల మూర్తి, కొల్లిపర పాపారావు, సమయమంతుల నాని పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వెంకన్న కల్యాణోత్సవాలు



శ్రీవరాల వెంకటేశ్వరస్వామి గజవాహన ఊరేగింపు దృశ్యం



స్వామివారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న దృశ్యం



విశేష అలంకరణలో శ్రీవరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవరాల వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం మైపాల సతీష్, పూజ దంపతులచే స్వామివారికి సుప్రభాతసేవ, మేలుకొలుపు, తోమాల సేవ నిర్వహించారు. సాయంత్రం పెన్మెత్స లక్ష్మీనరశింహరాజు, రామ సత్యవతి దంపతులు సమర్పించిన గజవాహనంపై స్వామి, అమ్మవార్లను మేళతాళాలతో గ్రామోత్సవం జరిపారు. సుదర్శనం సాయిరామాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యుల పర్యవేక్షణలో స్వామివారి కల్యాణ తంతును నిర్వహించారు. దారాబత్తుల సత్యనారాయణ దంపతులు మంగళ సూత్రాలు సమర్పించగా, సమతం వెంకటేశ్వరరావు దంపతులు ముత్యాల తలంబ్రాలు అందజేశారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి ఆకుల వెంకట నారాయణ, ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా డే ర్యాలీ



యోగా డే ర్యాలీని ప్రారంభిస్తున్న పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగా డేను పురస్కరించుకుని పట్టణంలో ఆదివారం ఉదయం ఘనంగా ర్యాలీని నిర్వహించారు. యోగా డేను మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించేందుకు వీలుగా మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రజలను ఆహ్వానించేందుకు గానూ ఆదివారం 150 మంది సభ్యులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. బాబా రామ్‌దేవ్ ఆదేశానుసారం భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా శాఖ ఇన్‌చార్జి, ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడే యోగ గురువు కరిబండి రామకృష్ణ సారథ్యంలో బైక్ ర్యాలీ పట్టణంలోని ప్రముఖ కూడళ్లలో, ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి టూటౌన్‌లోని రేలంగి థియేటర్ సర్కిల్ అక్కడ నుంచి ఎస్‌వీ రంగారావు విగ్రహం సెంటర్ వరకు నిర్వహించారు. తొలుత పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం జెండా ఊపి ప్రారంభించారు. న్యాయవాది మాకా శ్రీనివాస్, అపర్ణ ప్రసాద్, యోగ గురువులు ఐ.మాధవరావు, బి.చంద్రశేఖర్, సీహెచ్ అంబిక, సుభద్ర, నూకరాజు, యోగ బృంద సభ్యులు పర్యవేక్షించారు. కరిబండి రామకృష్ణ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ యోగా డే 10 సంవత్సరాలు క్రితం ప్రారంభించారన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని వివరించారు.

విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో ఫాదర్స్ డే



శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమంలో ఫాదర్స్ డే నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బిడ్డల ఉన్నతి కోరుకునే నిస్వార్థ సేవకు నిలువెత్తు సాక్ష్యం నాన్న అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమంలో ఆదివారం ఫాదర్స్ డేను నిర్వహించారు. తండ్రులకు పాద పూజ, సత్కారం చేశారు. ఆశ్రమ యోగ గురువు కరిబండి రామకృష్ణ, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆంజనేయరాజు, అపర్ణ ప్రసాద్, సుజాత, సుభద్ర, గుప్తా, మల్లేశ్వరరావు, పెంటపాడు సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగి కృష్ణాజీ, నిట్ ఎంప్లాయి చక్రధర్ సాయి కుమార్ తదితరులు మాట్లాడుతూ చిన్నతనంలో నాన్న చేయి పట్టుకుని ఈ ప్రపంచాన్ని చూపించారని, పెద్దయిన పిల్లలు నేడు నాన్న ఉన్నంత కాలం నేనున్నాను అనే భరోసా తండ్రికి ఇవ్వాలన్నారు. ఈ తరం పిల్లలకు తల్లిదండ్రులు విలువ తెలియజేయాలని సూచించారు.

కరాటే శిక్షణ శిబిరం ముగింపు



కరాటే శిక్షణ తీసుకున్న చిన్నారులతో నిర్వాహకులు

భీమవరం: డాక్టర్ బీవీ.రాజు వీరమ్మ పార్క్ కాంపౌండ్‌లో చిన్నారులకు కియో జపాన్ షోటోకాన్ కరాటే ఇనిస్టిట్యూట్‌చే ఉచిత కరాటే శిక్షణ నిర్వహించారు. కరాటే శిక్షణ ముగింపు సందర్భంగా శిక్షణ తీసుకున్న బాల బాలికలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర పీసీసీ సభ్యుడు, సీనియర్ బాడీ బిల్డర్ అద్దంకి దొరబాబు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా కరాటేలో అనేక మందికి శిక్షణ ఇస్తూ, వేసవి సెలవుల్లో క్రీడల వైపు పిల్లలకు ఆసక్తి కలిగించడానికి ఆటపాటలతో పాటు కరాటే లాంటి క్రీడల్లో శిక్షణ ఇప్పించాలన్నారు. నెలరోజులుగా కరాటే ఉచిత శిక్షణ ఇచ్చిన కోచ్ కరణం రాముని అభినందించారు. బాల్యం నుంచి పిల్లలకు విద్యతో పాటు తల్లిదండ్రులు క్రీడల పట్ల ఆసక్తి కల్పించాలని, ముఖ్యంగా బాలికలు కరాటే శిక్షణ తీసుకోవడంద్వారా ఆత్మ రక్షణకు దోహదపడుతుందన్నారు. భీమవరంలో 50ఏళ్లకు పైగా కరాటేలో ఎంతో మందికి శిక్షణ ఇచ్చిన కరాటే వెంకట్ మాస్టర్‌ను సత్కరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కరాటే కోచ్ కరణం రాము, వెంకట్ మాస్టర్, పుచ్చకాయల రత్నరాజు, కొర్ర శ్రీనివాస్, సుంకర సతీష్ పాల్గొన్నారు.

మొదటి గురువు నాన్న

తణుకు టౌన్: జీవిత పాఠాలు నేర్పే నాన్న బిడ్డకు మొదటి గురువని సాహితీ సామ్రాజ్యం సాహితీ సంస్థ అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు అన్నారు. తణుకులో అంతర్జాతీయ తండ్రుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుటుంబంలో తండ్రి స్థానం, పిల్లలపై తండ్రి ప్రభావం గురించి వివరించారు. తణుకు కేర్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ కోనా భార్గవ్, వ్యాపారవేత్త షర్మిష్ట వీరన్న, బీ.శ్రీనివాస్‌లను సత్కరించారు. 'నాన్న నేనున్నా' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కేర్ ఆసుపత్రి సిబ్బంది, దిర్సిపో మధుబాబు, ఎల్లే రాజు, కాపకాయల శిరీష, ఎం.వైష్ణవి, కవి ఎస్‌వీఎస్ ప్రసాద్ పాల్గొన్నార.

ఈదురుగాలుల బీభత్సం



ఆకాశంలో దట్టంగా కమ్మిన మేఘాలు

పెంటపాడు: మండలంలోని ఉదయం నుం,ఇ సాయంత్రం వరకు తీవ్ర ఉక్కబోత, ఎండగా ఉన్న వాతావరణం ఆదివారం సాయంత్రానికి చల్లబడింది.ఒక్కసారిగా దట్టంగా కమ్మిన మేఘాలు, ఈదురుగాలుల బీబత్సం సృష్టించాయి. దీంతో పలు ప్రాంతాల్లో రహదారులపై ప్రయాణించే వాహనదారులకు, ప్రజలకు ఆటకం కలిగింది. ప్రత్తిపాడు వద్ద ప్రధాన రోడ్డుపై భారీ చెట్టు కూలడంతో గూడెం నుంచి తణుకు వెళ్లే ప్రజలుతీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ స్తంభించింది.

తాడేపల్లిగూడెం మండలంలో..

తాడేపల్లిగూడెం రూరల్: ఈదురు గాలుల ధాటికి ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో చెట్ల కొమ్మలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీనిలో భాగంగానే చినతాడేపల్లి గ్రామంలో ఈదురు గాలుల ధాటికి విద్యుత్ లైన్లపై చెట్టు విరిగి పడటంతో విద్యుత్ స్తంభం రోడ్డుపై వెళ్తున్న కారుపై పడింది. అయితే, అప్పటికే విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడంలో పెద్ద ప్రమాదం తప్పింది. కారులోని వారికి ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం సంభవించలేదని కుంచనపల్లి సబ్ స్టేషన్ ఏఈ అల్లు రామకృష్ణ తెలిపారు. కాగా, మెట్ట ఉప్పరగూడెం 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌పరిధిలో ఆదివారం రాత్రి విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు తెలిపారు. 11కేవీకి సంబంధించి విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

ముగిసిన నేత్రాలమ్మ ఉత్సవాలు



ప్రత్యేకాలంకరణలో నేత్రాలమ్మ

పెంటపాడు: గత నెల రోజుల నుంచి నిర్వహిస్తున్న దర్శిపర్రు గ్రామ దేవత నేత్రాలమ్మ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామంలో భారీ సేవ, నైవేద్యాల కార్యక్రమాలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విందు కోసం వచ్చిన బంధువుల రాకతో గ్రామం కిక్కిరిసింది. ప్రతి వీధి కార్లు, మోటార్‌సైకిళ్లు, ప్రజలతో నిండిపోయింది. ఒక పక్క ఉక్కబోత, ఎండ వల్ల ప్రజలు అల్లాడారు. అలాగే గుణ్ణం చెరువు వద్ద ఉన్న నేత్రాలమ్మ అమ్మవారికి భక్తులు కుటుంబాలతో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ కోలా శేషవేణి, ఎంపీపీ దాసరి హైమావతి పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సులపై అవగాహన

భీమవరం : బీవీ.రాజు డిగ్రీ కళాశాలలో సోమ వారం ఉదయం డిగ్రీ ఆనర్స్ కోర్సుల (బీఎస్సీ, బీకాం, బీసీఏ)పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐఆర్.కృష్ణంరాజు తెలిపారు. ఈ సదస్సులో డిగ్రీ కోర్సుల ప్రాముఖ్యత, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకు అందుబాటులో ఉండే ఉద్యోగ అవకాశాలను వివరిస్తామన్నారు.

తాడేపల్లిగూడెంలో పార్కు ఏర్పాటుకు కృషి



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ సభ్యులందరూ ఆలోచించి తాడేపల్లిగూడెం పట్టణంలో మంచి పార్కు ఏర్పాటుకు ముందుకు రావాలని అందుకు తన వంతు సహాయ సహకారాలు తప్పక అందిస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వెల్లడించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలలో భాగంగా కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో జిల్లా డిప్యూటీ గవర్నర్ పదం కుమార్ గుప్తా ఆర్థిక సహకారంతో అధ్యక్షుడు వంగపండు రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణ నేత్ర వైద్యశాల వైద్యులు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో 132 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచిత కంటి ఆపరేషన్లు నిమిత్తం 14 మందిని నిడదవోలుకు పంపారు. 23 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించేందుకు నిర్ణయించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రీజియన్ ఛైర్‌పర్సన్ మదన్ మోహన్ అగర్వాల్, కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పేరూరి కాశయ్య, బాపయ్య శర్మ, సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని కోడే వెంకట్రావు ఉన్నత పాఠశాలలో బాస్కెట్ బాల్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి బాస్కట్ బాల్ టోర్నమెంట్‌ను ఆదివారం శాసన సభ్యులు ప్రారంభించారు. అదే విధంగా ప్లే గ్రౌండ్‌లోని వర్షానికి ప్రాంగణం మునుగుతుందని, లైటింగ్ సమస్యలు, సెక్యూరిటీ సమస్యలను క్రీడాకారులు బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ పీడీ చింతకాయల సత్యనారాయణ, హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఎస్‌పీ ద్వారానే రాజ్యాంగం అమలు



బీఎస్‌పీ సమావేశంలో పార్టీలో చేరిన యువతతో జిల్లా ఉపాధ్యక్షురాలు షర్మిల

పెంటపాడు: ప్రత్యేక ఎజెండా కలిగిన బహుజన్‌సమాజ్‌పార్టీ (బీఎస్‌పీ) ద్వారానే భారత రాజ్యాంగం సక్రమంగా అమలు అయ్యే అవకాశం ఉంటుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు మల్లిపూడి షర్మిల పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పెంటపాడు మండలం అలంపురం అంబేడ్కర్ సెంటర్‌లో ఆమె బహుజనసమాజ్ పార్టీ కార్యకర్తల తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి బహుజన సమాజ్ పార్టీ ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం గంజి హరికృష్ణ ఆధ్వర్యంలో సుమారు 40 మంది పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వనించారు. అనంతరం మండల పార్టీ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెంటపాడు మండల అధ్యక్షురాలిగా గంజి హైమావతి, ఉపాధ్యక్షురాలిగా చిన్నం నాగమణి, కోశాధికారిగా పోసిపోయిన దైవసహాయం తదితరులను నియమించారు. బీరా లక్ష్మి, పి.వెంకటలక్ష్మి, నేతల అంజిబాబు, చిన్నం శ్రీను, పెంటపాటి అచ్యుతరావు పాల్గొన్నారు.

ఉప్పటేరులో పూడిక తొలగించండి

ముంపునకు గురవుతున్న కొల్లేరు తీర గ్రామాలు



ఉప్పటేరుపై ఆకివీడు వద్ద రెండో రైలు వంతెన ఖానాల వద్ద పేరుకుపోయిన మట్టి

ఆకివీడు: రైల్వే డబ్లింగ్ లైన్స్‌నిర్మాణంలో భాగంగా ఉప్పుటేరుపై రెండో వంతెన నిర్మాణ సమయంలో ఏర్పడిన మట్టిని తొలగించకపోవడంతో కొల్లేరు తీర గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లేరు నుంచి అదనపు నీటిని సముద్రంలోకి తీసుకెళ్లే ఉప్పుటేరు 20 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం 10 నుంచి 12 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తోంది. డ్రెయినేజీ శాఖ నిర్లక్ష్యంతో ఉప్పుటేరు సామర్థ్యాన్ని కోల్పోతుంది. వీటికి కారణాలు సుమారు 7 సంవత్సరాల క్రితం రైల్వే డబ్లింగ్ పనుల్లో భాగంగా వంతెన నిర్మాణం చేపట్టారు. నిర్మాణ సమయంలో అవసరమైన పిల్లర్లు ఉప్పుటేరులో నిర్మించేందుకు మట్టితో మార్గం ఏర్పరుచుకున్నారు. సుమారు 200 అడుగుల లోతులో నిర్మించిన పిల్లర్లతో వచ్చిన మట్టిని, మార్గం కోసం ఏర్పాటు చేసిన మట్టిని ఉప్పుటేరులోనే వదిలేశారు. వీటికి తోడు రెండో వంతెన నిర్మాణంలో డ్రెయినేజీ శాఖ అనుమతి లేకుండా భారీ బండ్‌లు నిర్మించారు. దీంతో ఉప్పుటేరు గుండా నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి గోదావరి, కృష్ణా అదనపు జలాలు పంట, మురుగు కాల్వల ద్వారా ఉప్పుటేరులోకి చొచ్చుకు వస్తున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే చినుకు పడితే ఉప్పుటేరులోకి అదనపు నీరు ప్రవేశిస్తుంది. ఈ పరిస్థితుల్లో రైలు వంతెనల మధ్యలో ఏర్పడిన పూడికలు నీటి ప్రవాహానికి తీవ్ర ఇబ్బంది కల్గిస్తున్నాయని కొల్లేరు తీర గ్రామాల ప్రజలు డ్రెయినేజీ శాఖకు, రైల్వే అధికారులకు గతంలో అనేక సార్లు ఫిర్యాదులు చేశారు. దీనిపై రైతులు ఆందోళన చేపట్టినా సంబంధిత రైల్వే కాంట్రాక్టర్ ఉప్పుటేరులో రైలు వంతెనల వద్ద పూడికల్ని తొలగించలేదని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంత ఎంపీలు స్పందించి రైల్వే అధికారులతో మాట్లాడి, సంబంధిత కాంట్రాక్టర్ వెంటనే పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్‌హెచ్ వంతెన నిర్మాణంలోనూ

జాతీయ రహదారి నెం.165 విస్తరణలో బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఉప్పుటేరుపై వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. సంబంధిత కాంట్రాక్టర్ ఉప్పుటేరులో మట్టి పూడ్చి సుమారు 48 పిల్లర్లు నిర్మించి, ఆరు బండ్‌లు నిర్మించేందుకు పనులు మొదలు పెట్టి అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఉప్పుటేరు సగానికి పైగా మట్టితో పూడుకుపోయింది. పనులు పునః ప్రారంభించకపోవడంతో ఈ ఏడాది పనులు చేసే అవకాశాలు కన్పించడం లేదు. దీంతో పూడికలతో ఉప్పుటేరులో నీటి ప్రవాహం మరింత మందగించే అవకాశం ఉందని రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు ఉప్పుటేరులో ఏళ్ల తరబడి పూడికలు తీయకపోవడంతో సుమారు 150 అడుగుల లోతు ఉండే ఉప్పుటేరు 70, 80 అడుగులకు పూడుకుపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెడల్పులో కూడా చాలా చోట్ల ఉప్పుటేరు కుచించుకుపోయింది.